క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: కౌతాళంలో మతసామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహలను, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

వర్షం కోసం విద్యార్థుల పూజలు



త్రైంభకేశ్వరస్వామి ఆలయం వద్ద టెంకాయలు కొడుతున్న దృశ్యం

కౌతాళం: వర్షం కోసం మండల కేంద్రమైన కౌతాళంలో గురువారం ప్రతిభ హైస్కూల్ విద్యార్థులు కరస్పాండెంట్ దూద్‌బాషా, ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరిల ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి దేవాలయాలు, దర్గాలు, చర్చిల్లో ప్రార్థనలు చేశారు. త్రైంభకేశ్వరస్వామి శివాలయంలో పూజలు చేసి 101 టెంకాయలు కొట్టారు. ఖాదర్‌లింగస్వామి దర్గా వద్ద 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక ఫాతెహాలు చేశారు. అలాగే చర్చిలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, జయలక్ష్మి, రామలక్ష్మి, శిరీష, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర ఘటకాభిషేకం

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని సంతపేట నాగలింగేశ్వరస్వామి, శ్రీ పేటి వీరభద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం సహస్ర ఘటకాభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, గ్రామపెద్దలు అల్కూరు మఠం మహర్షి విజయ్‌కుమార్‌స్వామి తెలిపారు. ఉదయం 4.30 గంటలకు నాగలింగేశ్వర, వీరభద్రస్వామి వారికి ఏకకాలంలో రుద్రాభిషేకం, ఉదయం 9 గంటల నుంచి సహస్ర ఘటకాభిషేకాలు చేపడుతున్నట్లు చెప్పారు. మహాపూజ, నివేదన, మహామంగళ హారతి, ఇత్యాది పూజలు చేపడతామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ఎరుకల కాలనీలో సమస్యలు పరిష్కరించండి

ఆదోని అర్బన్: ఎరుకల కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కాలనీకి చెందిన మహిళలు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కోరారు. గురువారం వారు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యేని కలిసి పలు సమస్యలను తెలియజేశారు. కాలనీ మహిళలు మాట్లాడుతూ డ్రైనేజీ, ఇరుకుగా ఉన్న రోడ్లు, కరెంట్ పోల్, తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సపదించి ఎమ్మెల్యే కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలనీవాసులు సుంకమ్మ, దుర్గమ్మ, లక్ష్మి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద జెడ్పీ పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోధ్యాయురాలు సునితదేవి, పీడీ ఈరన్న తెలిపారు. కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో బుధవారం జరిగిన పోటీల్లో 9వ తరగతికి చెందిన హనుమంతు, హైమవతి పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైయ్యారన్నారు. ఈ మేరకు గురువారం విద్యార్థులను ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

శిథిలమైన రోడ్డుకు మరమ్మతులు చేయండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కలుగొట్ల రోడ్డులోని ఎంబీ చర్చి నుంచి ఖబరస్తాన్ వరకు శిథిలమైన రోడ్డును వెంటనే మరమ్మతులు లేదా పునర్నిర్మించాలని ప్రగతి శీల యువజన సంఘ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కేఎండీ హనీఫ్ డిమాండ్ చేశారు. గురువారం పీవైఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారిందని, దీంతో కాలనీ వాసులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతమన్నారు. రోడ్డు మరమ్మతుకై ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రైతుకూలీ సంఘ నాయకులు ఏసేపు, విజయ్, చిన్ని కృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు వేళాయె.. సౌకర్యాలు కరువాయె

- రణమండల ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 5 నుంచి శ్రావణమాస ఉత్సవాలు
- 41 రోజులు మండలదీక్ష చేపట్టనున్న భక్తులు
- ఏటా రూ.లక్షల ఆదాయం
- భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించని నిర్వాహకులు



శ్రావణమాసంలో ముఖద్వారం వద్ద కొండ ఎక్కుతున్న భక్తులు (ఫైల్)

ఆదోని అర్బన్: కొలిచేవారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీ రణమండల ఆంజనేయస్వామి వారి శ్రావణమాస ఉత్సవాలు ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నాయి. ప్రతిరోజూ వందల సంఖ్యలో భక్తులు 41 రోజులపాటు స్వామివారిని దర్శించుకుంటారు. అయితే ఉత్సవాల్లో ఆలయ నిర్వాహకులు సౌకర్యాలు కల్పించడంలో విఫలం చెందుతున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షల్లో హుండీ విరాళాల ద్వారా ఆదాయం ఉన్నా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

శనివారాల్లో అధిక రద్దీ

శ్రావణమాస ఉత్సవాల్లో నాలుగు శనివారాలు వస్తాయి. మొదటి, రెండో శనివారాల్లో వేల సంఖ్యలో, 3, 4వ శనివారాల్లో లక్షలాది సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. అంతేగాకుండా 4వ శనివారం పట్టణ ప్రధాన రహదారిలో సాయంత్రం 5 గంటల నుంచి రథోత్సవ కార్యక్రమం ఉంటుంది. శ్రావణమాసంలో 41 రోజులపాటు స్వామివారిని దర్శించుకునేందుకు ప్రతిరోజూ రాత్రి నిద్రించడానికి పదుల సంఖ్యలో వచ్చి ఉదయం పూజ చేసుకుని వెళ్తారు. అదే శుక్రవారం రాత్రి అయితే వందల సంఖ్యలో భక్తులు నిద్ర చేయడానికి వస్తే వారికి ఉదయం స్నానపు ఘట్టాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. కేవలం ఒక్క కుళాయి మాత్రమే ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు ఘర్షణ పడే పరిస్థితులు ఉన్నాయి. సౌకర్యాలు లేక శుక్రవారం రాత్రి వచ్చే భక్తులు తీవ్ర స్థాయిలో తగ్గిపోతోంది.

ట్యాంకుల శుభ్రత లేదు

శ్రీ రణమండల కొండ ప్రాంతంలో నీటికొరత వల్ల గత 20 సంవత్సరాల క్రితం కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు, భక్తుల సౌజన్యంతో కొండ కింద ఉన్న బోరుకు కనెక్షన్ ఇచ్చి కొండ కింద ఒక ట్యాంకు, కొండపైన ఒక ట్యాంకును ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించారు. అనంతరం ఐదారు సంవత్సరాల క్రితం సినీ నిర్మాత టి.జి.ప్రసాద్ సౌజన్యంతో కొండపైన మరో పెద్ద ట్యాంకును కూడా ఏర్పాటు చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా ఈ నీటి ట్యాంకులను ఒకసారి కూడా శుభ్రం చేయలేదు. ఆ నీటినే భక్తులు తాగడానికి వాడుతున్నారు.

నిర్మాణం చేయడం, పగలగొట్టడంతో నిధులు వృథా

శ్రీ రణమండల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కొత్తగా నిర్మాణాలు చేపట్టడం వాటిని మరలా తొలగించడం నిర్వాహకులు పనిగా పెట్టుకుంటున్నారని భక్తులు వాపోతున్నారు. ఆలయానికి ఇచ్చిన విరాళాలు, హుండీ ఖజానా అంతా ఇలా నిర్మాణం చేయడం, తొలగించడానికే వృథా చేస్తున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ సౌకర్యం తక్కువే...

కొండ ప్రాంతంలో విద్యుత్ దీపాలు కొన్ని చోట్ల లేక సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ సాయంతో భక్తులు స్వామివారి చెంతకు చేరుకుని దర్శించుకుంటున్నారు. భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి ఆలయం నుంచి రణమండల కొండకు నడిచి వచ్చే భక్తులకు రహదారుల్లో అసలు విద్యుత్ దీపాలే లేవు. ఆ ప్రాంగణమంతా కారుచీకటిగా ఉంటుంది. అదేవిధంగా రాంజల రోడ్డు సమీపంలో కొన్నిచోట్ల కూడా విద్యుత్ దీపాలు కూడా లేవని భక్తులు వాపోతున్నారు. అంతేగాకుండా అక్కడి నుంచి స్వామివారి కొండకు వెళ్లే దారిలో కూడా అక్కడక్కడ లైట్లు వెలగడంలేదని భక్తులు పేర్కొంటున్నారు.

పార్కింగ్‌కు వసూళ్లు...

శ్రావణమాస ఉత్సవాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు ద్విచక్ర, కారు వాహనాల్లో భక్తులు వస్తారు. వచ్చే భక్తులకు పార్కింగ్ రుసుము వసూలు చేస్తున్నారు. ఇందుకు శ్రావణమాస ఉత్సవాల ముందే టెండర్ వేసి కాంట్రాక్టర్లకు అప్పజెబుతున్నారు. దీంతో 41 రోజులు, శనివారం రోజు వచ్చిన భక్తులతో బెదిరించి వసూలు చేస్తున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు

కొండపై ఆంజనేయస్వామి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాల్లో రూ.లక్షల్లో హుండీ విరాళాలు వస్తున్నాయి. మామూలు రోజుల్లో కూడా ప్రతిరోజూ 50 మంది శనివారం వందల్లో భక్తులు దర్శించుకుంటారు. ఇంత ఆదాయం వచ్చినా సీసీ కెమెరాలను తూతూ మంత్రంగా పెట్టారు. కేవలం ఒక్కచోట మాత్రమే సీసీ కెమెరా ఉన్నా అది కూడా పనిచేయడం లేదు. గతంలో సీతారాముల లక్ష్మణ ఆంజనేయస్వామి ఆలయ గోపురాన్ని గుర్తు తెలియని దుండగులు పగలగొట్టారు. శ్రావణమాసం ఉత్సవాల్లో లక్షలాది సంఖ్యలో భక్తులు వస్తున్నప్పుడు చోరీలు జరిగే అవకాశం కూడా ఉంది. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

మహిళలకు బాత్‌రూంలు కరువు

శ్రావణమాసం ఉత్సవాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం వందల సంఖ్యలో మహిళలు, యువత వస్తారు. వారు కాలకృత్యాలు, బహిర్భూమికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు భక్తులు చెబుతున్నారు. ఉత్సవాల్లో ఎక్కడ చూసినా భక్తులు ఇంటి నుంచి పిండి వంటలు తెచ్చుకుని, స్వామివారి ఆలయ ప్రాంగణంలో కూర్చొని భుజిస్తారు. అయితే మహిళలకు బాత్‌రూమ్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, నిర్వాహకులు స్పందించి ఇప్పటికైనా సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం

ఉత్సవాల్లో భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తాం. రణమండల ఆంజనేయస్వామి ఆలయ పరిధిలో త్వరలో స్నానపు ఘట్టాలను ఏర్పాటు చేస్తాం. నీటి ట్యాంకులను కూడా ఇటీవల శుభ్రం చేయించాం.

– టీజీ పాండురంగయ్యశెట్టి, ఆలయ నిర్వాహకుడు

యంత్రసామగ్రి ధ్వంసం బాధాకరం



ఈఈ భాస్కర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం : గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని మాధవరం స్టేజ్-1 పంపుహౌస్‌లో దుండగులు విద్యుత్ సామగ్రి ధ్వంసానికి పాల్పడటం బాధాకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం పంపుహౌస్‌ను సందర్శించి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. దుండగులు మోటార్లు, స్టార్టర్లు ధ్వంసం చేసి 15 కాపర్ షీట్లను దొంగచడంపై విచారం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచన మేరకు తక్షణ సాయంగా రూ.5 లక్షలు ప్రకటించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఈ ఏడాది ఎంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే దుండగులను గుర్తించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. టీడీపీ నేతలు సైతం పంపుహౌస్ మరమ్మతులకు సహకరించాలని కోరారు.

మరమ్మతులు చేపట్టాలి

పంపుహౌస్‌లో మరమ్మతులు చేపట్టాలని ప్రాజెక్టు ఈఈ భాస్కర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు ప్రాజెక్టు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. గురువారం సాయంత్రం ఎమ్మిగనూరులోని జీఆర్పీ కార్యాలయంలో ఈఈని కలిశారు. ప్రస్తుతం నదిలో పుష్కలంగా వరద నీరు ప్రవహిస్తోందని ఈఈ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ఇబ్బందులు దృష్ట్యా వెంటనే పైంపుహౌస్‌లో మర్మతులు చేపట్టి సాగునీరు అందేలా చూడాలని కోరారు. ఆయనతోపాటు పార్టీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, నాయకులు వెంకట్రామిరెడ్డి, వెంకోబా, రోగప్ప పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి



సబ్‌కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మిగనూరు తహసీల్దార్ శేషఫణి

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం పట్ల ప్రతి అధికారి బాధ్యతగా పని చేయాలని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లోని 9 మండలాలకు సంబంధించి కొత్తగా తహసీల్దార్లుగా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. వారు బాధ్యతగా పని చేయాలన్నారు. మీ ద్వారా పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మిగనూరు మండలానికి కొత్తగా వచ్చిన తహసీల్దార్ శేషఫణి మర్యాదపూర్వకంగా సబ్‌కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ తహసీల్దార్‌కు పలు సూచనలు చేశారు.

ఎమ్మిగనూరు తహసీల్దార్‌గా శేషఫణి

ఎమ్మిగనూరురూరల్: స్థానిక తహసీల్దార్‌గా ఎ.శేషఫణి గురువారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తాను గతంలో సీ.బెళగల్ మండలంలో పనిచేశానని ఎన్నికల బదిలీల్లో భాగంగా గుంతకల్‌కు వెళ్లి అక్కడి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చానని చెప్పారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను రెవెన్యూ అధికారులు, డీలర్స్ అసోషియేషన్ నాయకులు, వివిధ గ్రామాల నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు.

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

ఆదోని అర్బన్: ఎమ్మార్పీఎస్ నాయకుల పోరాటం ఫలితంగా సుప్రీంకోర్టు నేడు ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సబబేనని తీర్పునివ్వడం సంతోషించదగ్గ విషయమని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. గురువారం ఎమ్మెల్యేను ఆదోనిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మార్పీఎస్ సంబరాలు

ఆదోని రూరల్: ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ పట్టణాధ్యక్షులు గుమ్మల బాలస్వామి మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.నాగప్ప మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదోనిలోని భీమాస్ కూడలి వద్ద టపాకాయలు కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు.

కోసిగి: స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఎంఎస్పీ నాయకులు దుర్గప్ప మాదిగ, ఎంఆర్‌పీఎస్ తాలూకా కన్వీనర్ నాగరాజులు ఆధ్వర్యంలో బాణా సంచా పేల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.



గోనెగండ్లలో అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దకడబూరు : సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణ తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎంపీ యువరాజు మాదిగ, జే సతీష్ మాదిగ అన్నారు. మందకృష్ణ నాయకత్వంలో వర్గీకరణ సాధించడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

గోనెగండ్ల : ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడంతో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహాదేవ్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మందకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

కోసిగి: పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, ఆరునెలల వరకు తల్లిపాలు తాపడం పిల్లలకు శేయస్కరమని కోసిగి ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి అభిరూప్, డాక్టర్ మౌనిక అన్నారు. గురువారం స్థానిక స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్య సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలచే తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే మండలంలోని డి.బెళగల్‌లో గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లివాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, ఎల్లప్ప, రాముడు, సూపర్ వైజర్ పద్మ తదితరులు పాల్గొన్నారు .

కౌతాళం ఎంఈఓగా ఆంజనేయులు

కౌతాళం: కౌతాళం మండల విద్యాధికారి-1గా ఆంజనేయులు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. టీచర్ల కొరతను అధిగమించి అందరూ బాధ్యతాయుతంగా పనిచేసేలా చర్యలు చేపడతానన్నారు.

హోమియోపతి పీజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ



కావ్యశ్రీ

ఎమ్మిగనూరుటౌన్: ఇటీవల జరిగిన ఆల్‌ఇండియా ఆయూష్ విభాగ హోమియోపతి పీజీ ప్రవేశ పరీక్షలో పట్టణానికి చెందిన సర్ల కావ్యశ్రీ ఇండియా స్థాయిలో 119వ ర్యాంక్‌ను సాధించి రాష్ట్రంలో టాపర్‌గా నిలిచింది. ఈ మేరకు గురువారం స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినిని తల్లిదండ్రులు మోహన్, ఉషాపరిమళతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కె.బసాపురం గ్రామంలో అత్తింటి వేధింపులు తాళలేక ఉరివేసుకొని బోయ సుజాత ఆత్మహత్య చేసుకున్న కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మృతురాలు బోయ సుజాత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు భర్త కౌతాళం బోయ తాయప్ప, అత్తమామలు బోయ తిమ్మప్ప, ఎల్లమ్మలపై కేసు నమోదు చేశామన్నారు.

పారిశుద్ధ్యంతో వ్యాధులు దూరం



పట్టణంలో డ్రైనేజీల్లో పూడిక తీత పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ వాసులు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రధాన ముగురు కాలువల్లో పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలపై బండలు వేసి మూసేస్తే పూడిక తీతకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కాలువల ఆక్రమణలకు పాల్పడితే దుకాణదారులు, గృహ యజమానులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

పెద్దకడబూరు: ఉపాధి కూలీలకు 9 వారాలకు పైగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కల్లుకుంట గ్రామం ఉపాధి పనుల వద్ద బీకేఎంయూ ఆధ్వర్యంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు కుమ్మరి చంద్ర అధ్యక్షతన గురువారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వేతనాలు అందక కూలీలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. చాలామంది కూలీలు ఉపాధి దొరకక, మరికొంత మంది కూలీలకు జాబ్‌కార్డులు లేక వలసబాట పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రఫీక్, నరేష్, పోతురాజు, నరసప్ప పాల్గొన్నారు.

నాయీ బ్రహ్మణ సంఘం ఎన్నిక

కౌతాళం: మండల నాయీ బ్రహ్మణ సంఘాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శివరాజు, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, సెక్రటరీగా ఈరన్న, జాయింట్ సెక్రటరిగా రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా రంగయ్య, మునిస్వామి, కోశాధికారిగా కిట్టు, కన్వీనర్‌గా తిక్కయ్యలతో పాటు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం సభ్యులు అశోక్, లింగ, రవి, అనిల్, బాలకృష్ణ పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

ఎమ్మిగనూరురూరల్: అంగన్‌వాడీ వర్కర్లపై రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, అర్బన్ కార్యదర్శి నాగలక్ష్మి కోరారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీసవేతనం పెంచాలన్నారు. చిట్టెమ్మ, సుమిత్ర పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే అర్హులందరికీ పింఛన్లు



16వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న వార్డు కౌన్సిలర్ వాహిద్

ఎమ్మిగనూరుటౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి పింఛన్లు మంజూరు చేశారని 16వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వాహిద్ అన్నారు. గురువారం ఆవార్డు సచివాలయ సిబ్బందితో కలిసి వార్డు పరిధిలో పింఛన్ దారులకు పింఛన్లను పంపిణీ చేశారు. తమ వార్డులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు.

స్కౌట్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ



పాఠశాల హెచ్‌ఎంకు స్కార్ఫ్‌ను బహూకరిస్తున్న స్కౌట్ విద్యార్థినులు

ఎమ్మిగనూరుటౌన్: స్కౌట్ అండ్ గైడ్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు దేశభక్తి అలవడుతుందని ఎంఎస్ జెడ్పీ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి అన్నారు. స్కౌట్ అండ్ గైడ్‌లో భాగంగా గురువారం స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ స్కౌట్ స్కార్ఫ్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు హెచ్‌ఎంకు స్కార్ఫ్‌ను ధరింపజేశారు. విద్యార్థినులు స్కౌట్‌కు సంబంధించిన చార్ట్‌లను ప్రదర్శించి మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల స్కౌట్ గైడ్ ప్లైన్, పీడీ సుజనకుమారి తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: క్రమశిక్షణ, పోరాట పటిమ ప్రతి విద్యార్థినికి ఉండాలని కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత అన్నారు. గురువారం పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో స్కార్ఫ్‌డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు టైలను పంపిణీ చేశారు కార్యక్రమంలో పీఈటీ లక్ష్మి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను అడ్డుకున్న టీడీపీ నాయకులు



గోనెగండ్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణ పనులు

గోనెగండ్ల: ఓ టీడీపీ నాయకుడి దౌర్జన్యం కారణంగా మండల కేంద్రం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు నిలిచిపోయాయి. పాఠశాలలో నాడు-నేడు కింద 2023-24 ఏడాదికి గాను మూడు అదనపు నూతన తరగతి గదుల నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఒక్కో గదికి రూ.12లక్షల ప్రకారం రూ.36లక్షలు కేటాయించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనుల్లో కొంత జాప్యం సాగింది. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఆతరువాత పాఠశాలలో నాడు-నేడు కింద పనులను మొదలు పెట్టారు. అయితే ఓ టీడీపీ నాయకుడు పాఠశాలలో జరిగే నాడు-నేడు పెండింగ్ పనులను తానే పూర్తి చేస్తానని, తాను కాకుండా ఇంకెవరు చేస్తారంటూ పనులను అడ్డుకున్నాడు. నియోజకవర్గం టీడీపీకు చెందిన ఓ ప్రజా ప్రతినిధితో సంబంధించిన అధికారులకు ఫోన్ చేయించాడు. ఆ పనులు మా వాడు చేస్తాడు. ఇంత వరకు మీరు చేసింది చాలు అంటూ ఇంత ముందు పనులు చేసిన వారిని టీడీపీ నేత బెదిరించినట్లు తెలిసింది. దీంతో పాఠశాల గదుల నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. అధికారుల ఆ ప్రజా ప్రతినిధి మాటలకు ఎదురుచెప్పాలేక చోద్యం చూడాల్సిన పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విడుదలైన నిధులతో జరుగుతున్న పనులను టీడీపీ నాయకులు నిలిపి వేయడం పట్ల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు కలుగజేసుకొని పాఠశాల పనులు కొనసాగే విధంగా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం నాగభూషణంను వివరణ కోరగా పాఠశాలలో నాడు-నేడు పనులు నిలిచిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారి ఆదేశాల మేరకు నిలిచిపోయిన పనులను త్వరలో పునఃప్రారంభిస్తామని చెప్పారు.

టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారు..



మాట్లాడుతున్న గిరి ఆచారి

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో వెలిసిన శ్రీ సత్య నారాయణస్వామి ఆలయం ముందున్న స్థలంలో పాతిన బండలను టీడీపీ నాయకులు ధ్వంసం చేశారని ఆలయ అర్చకుడు గిరి ఆచారి ఆరోపించాడు. తనకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పార్థసారథికి పత్రికా ముఖంగా విన్నవించుకున్నాడు. రెండు రోజులుగా తన ఇంటి వద్దకు వచ్చి టీడీపీ నాయకులు ఈ స్థలం మాదని, వెంటనే పాతిన బండలను తొలగించాలని బెదిరిస్తున్నారని చెప్పారు. దీంతో తాను బుధవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రికార్డులను చూపించి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయడం జరిగిందన్నాడు. అయితే పోలీస్‌స్టేషన్ నుంచి ఇంటికి వచ్చేలోపు తన స్థలంలో వేసుకున్న బండలను కొందరు టీడీపీ నాయకులు ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను 2017లోనే కోర్టులో కేసు గెలిచి ఈ స్థలాన్ని సొంతం చేసుకోవడం జరిగిందని వివరించాడు. ఎమ్మెల్యే స్పందించి తనను బెదిరిస్తున్న టీడీపీ నాయకులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

ఆదోని రూరల్: జూలై నెల 28వ తేదీన ఆదోని మండలంలోని పెద్దపెండేకల్ గ్రామానికి చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన బోయ తలారి నరసింహులు అత్యాచారయత్నం చేసిన ఘటనలో అరెస్టు చేసినట్లు ఆదోని రూరల్ సీఐ నిరంజన్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ వివరాలను వెల్లడించారు. జూలై 28వ తేదీ నుంచి నిందితుడు బోయ తలారి నరసింహులు పరారీలో ఉన్నాడన్నారు. దీనిపై డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టామన్నారు. గురువారం సాంబగల్లు ఆంజనేయస్వామి ఆలయం వెనక నరసింహులు ఉన్నాడని పక్కా సమాచారం రావడంతో వెళ్లి పట్టుకోవడం జరిగిందన్నారు. నిందితుడిపై క్రైమ్ నం. 67/2024 యూ/సెక్షన్ 64 ఆర్/డబ్ల్యూ 62 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి, ఆదోని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సీఐ చెప్పారు. నిందితుడిని పట్టుకున్న సీఐ నిరంజన్, ఎస్ఐలు శ్రీనివాసులు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ శివనారాయణస్వామి అభినందించారు.

తాగునీటి సమస్య పరిష్కారం



నూతనంగా బోరును వేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో 15వ ఫైనాన్స్ నిధులు దాదాపు రూ.70వేలతో తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ తెలిపారు. గ్రామంలో కొత్తగా తాగునీటి బోరును వేయించడంతో పాటు పాత బోరును శుభ్రం చేయించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా గ్రామంలో ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కొత్తబోరుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కొత్త బోరులో దాదాపు రెండున్నర ఇంచులకు పైగా నీరు పడిందని, దీంతో గ్రామంలో తాగునీటి సమస్యే ఉండదని చెప్పారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. గ్రామం అభివృద్ధికి అన్ని పార్టీల నాయకులు, ప్రజలు తనకు సహకరించాలని కోరారు.

98 శాతం పింఛన్ల పంపిణీ



అంబేడ్కర్ నగర్‌లో పింఛన్లను పంపిణీ చేస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని టౌన్: నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులకు అధికారులు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ, టీడీపీ నాయకులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని మున్సిపాలిటీలో 17,027 పింఛన్లు ఉండగా, అందులో సాయంత్రం 5 గంటల సమయానికి 98 శాతం పంపిణీని పూర్తి చేశారు. ఆదోని మండలంలో 11,717 పింఛన్లు ఉండగా.. 11,475 మందికి పంపిణీ చేశారు.

పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 15, 23వ వార్డుల్లో గురువారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లను అందజేశారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.